క్లుప్తంగా

ఆరోగ్య సేవలపై సర్వే

భీమడోలు: రాష్ట్రంలో ఇంటింటికీ అందుతున్న ఆరోగ్య సేవలపై జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 6 చేసేందుకు ప్రారంభ రోజైన శనివారం 8 మంది సభ్యుల కేంద్ర బృందం గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలోని ఆగడాలలంకలో పర్యటించారు. ఈ సర్వే ద్వారా వివిధ ఆరోగ్య సేవలు ప్రజలకు ఏ స్థాయిలో అందుతున్నాయో అంచనా వేయడం, సర్వేలో వచ్చిన సమాచారం మేరకు ఆరోగ్య సేవలను మరింత పటిష్టం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికలు తయారీ చేస్తారని అధికారులు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ సర్వే బృందం ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలుత వారికి ఎంపీపీ కనమాల రామయ్య, సర్పంచ్ భలే రాంబాబు స్వాగతం పలికారు. జిల్లా నోడల్ అధికారులు సాగర్, కృష్ణారావు, మల్లేశ్వరి, సుబ్బలక్ష్మి, బేగ్, ఆశావర్కర్లు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేడు అపుస్మా సమావేశం

ఉంగుటూరు: ఏలూరు జిల్లా స్థాయి అపుస్మా (ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు, అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంటు అసోషియన్) సమావేశం నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహిస్తున్నామని అపుస్మా జిల్లా అధ్యక్షుడు గుణ్ణం బుల్లఅబ్బాయి వెల్లడించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమానులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉత్తమ ఉపాధ్యాయులను వంద మందిని గుర్తించి సత్కరిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న సమావేశానికి ముఖ్య అతిథులు ఎమ్మెల్సీ, రాష్ట్ర అపుస్మా అధ్యక్షుడు ఎం వీ రామచంద్రారెడ్డి, డీఈవో శ్యామ్ సుందర్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, అపుస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బూరుగుపల్లి గోపాలకృష్ణ పాల్గొంటారని తెలిపారు.

చంద్రబాబు అరెస్టు రాజకీయ కుట్ర కాదు

- 2017లో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చింది
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి


నిడమర్రు : సమావేశంలో మాట్లాడుతున్న సంకు నాగశేషు


భీమడోలు: సమావేశంలో రావిపాటి సత్యశ్రీనివాస్, ఎం జాన్సన్

దెందులూరు: చంద్రబాబునాయుడు అరెస్టు రాజకీయ కుట్ర కాదని, ఈ స్కాం 2017లో వెలుగులోకి వచ్చిందని, అప్పటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాలేదని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఏ 1 అని ఉన్నతాధికారులు దర్యాప్తు సంస్థలు క్షేత్రస్థాయిలో విచారించి అన్ని ఆధారాలు సేకరించి అరెస్టు చేశాయన్నారు. ఈ స్కాం 2017 నుంచి ఉన్నప్పుడు చంద్రబాబు కోర్టులో ఎందుకు కేసు వేయలేదని, ఎందుకు విచారణ చేయించలేదని ప్రశ్నించారు. భవిష్యత్తుపై ఎంతో ఆశపెట్టుకున్న లక్షలాది మంది యువతను, ప్రజలకు మాయమాటలు చెప్పి, మభ్యపెట్టి ఆశలు కల్పించి జనాలను మోసం చేసి బండారం బయటపడే సమయానికి సానుభూతి సంపాదించాలని చంద్రబాబు అనుకుంటున్నారని ఎమ్మెల్యే అన్నారు. చంద్రబాబుకు ఆయన ఏమి చేశారో తెలుసు కనుక అరెస్టు అవుతాను అన్న విషయం ఆయనే ముందు చెప్పారన్నారు. క్యాబినెట్ రూ.370 కోట్లు విడుదల చేస్తే అందులో రూ. 241 కోట్లు హవాలా రూపంలో సొమ్మును చంద్రబాబు అకౌంట్‌లోకి చేర్చారు. వివిధ కంపెనీల ద్వారా చంద్రబాబు ఈ తతంగమంతా నడిపారన్నారు. 2017లో ఈ స్కామ్ వెలుగులోకి వచ్చినప్పుడు ఎందుకు విచారణ చేయలేదని చంద్రబాబును ప్రశ్నిస్తున్నానని అబ్బయ్యచౌదరి అన్నారు.

స్కిల్ స్కాంలో చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

నిడమర్రు: స్కిల్ డవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ అక్రమం కాదు, సక్రమమే అని వైఎస్సార్ సీపీ స్టేట్ కమిటీ జాయింట్ సెక్రటరీ సంకు నాగేషు అన్నారు. బువ్వనపల్లిలో ఆయన వసతి గృహంలో శనివారం నిర్వహించిన సమావేశంలో నాగేషు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే ఉద్దేశ్యంతో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే ఏపీ స్కిల్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు రాష్ట్రంలోని యువతను మభ్యపెట్టి ఆ సొమ్ములు దారి మళ్లించడాన్ని రాష్ట్రంలోని నిరుద్యోగులు, యువత తీవ్రంగా ఖండించాలని వైసీపీ యూత్ కమిటీ తరుపున పిలుపు సంకు శేషు నిచ్చారు. చంద్రబాబు అరెస్ట్‌పై టీడీపీ శ్రేణులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని వైసీపీ స్టేట్ కమిటీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఏపీ స్కిల్ డవలప్‌మెంట్‌లో రూ వందల కోట్లలో కుంభకోణం జరిగిందని, దర్యాప్తులో చంద్రబాబే ప్రధాన నిందితుడని ఏపీ సీఐడీ అడిషనల్ డీజీ సంజయ్ స్పష్టం చేసినా టీడీపీ శ్రేణులు రాద్ధాంతం చెయ్యడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. రాజకీయ లబ్ధికోసం చంద్రబాబును కుట్రపూరితంగా అరెస్ట్ చేశారని, నిబంధనలకు విరుద్ధంగా సీఐడీ వ్యవహరిస్తోందన్న జనసేన పవన్ కళ్యాణ్, బీజేపీ పురందేశ్వరి వ్యాఖ్యలను వైసీపీ యూత్ కమిటీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నట్లు సభ్యులు ప్రకటించారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పూసల వెంకటేశ్వరరావు, కొరుపోలు అప్పారావు, సంకు తాతాజీ తదితరులున్నారు.

స్కిల్ స్కాం సూత్రధారి చంద్రబాబు అరెస్ట్ సక్రమమే

భీమడోలు: స్కిల్ స్కాం ప్రధాన సూత్రధారి, మాజీ సీఎం చంద్రబాబు అరెస్ట్ సక్రమేనని, రూ.370 కోట్ల ప్రజాధనాన్ని అపార అనుభవం గల చంద్రబాబు షెల్ కంపెనీలకు దోచిపెట్టారని వైఎస్సార్ సీపీ నేతలు అన్నారు. భీమడోలులోని సర్పంచ్ పాము సునీతామాన్‌సింగ్ క్యాంపు కార్యాలయంలో శనివారం మండల వైసీపీ ముఖ్య నేతలు సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ, జనసేన, బీజేపీ, తదితర పార్టీలు చంద్రబాబు అరెస్టుపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నోరు పారేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్, మండల సచివాలయాల కన్వీనర్ మద్దుల రాజా మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పేరుతో షెల్ కంపెనీలకు రూ, కోట్లు మళ్లించి దోచుకున్నారని, వాటిని పక్కా సాక్ష్యాధారాలతో రుజువైనందున సీఐడీ, సిట్ అధికారులు అరెస్ట్ చేసారన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువత, విద్యార్థుల జీవితాలతో అంధకారాన్ని నింపాడన్నారు. విపక్షాలు గగ్గోలు పెడుతున్నట్లుగా ఇది రాజకీయ కక్ష సాధింపు చర్య కానే కాదన్నారు. చట్టం ముందు అందరూ సమానులేనని, చట్టం తన పని తాను చేస్తుందన్నారు. చంద్రబాబుకు శిక్ష ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. ఈ సమావేశంలో మండల వైసీపీ ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, చైతన్య యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, పోలసానిపల్లి మాజీ ఉపసర్పంచ్ అంబటి నాగేంద్ర ప్రసాద్, వివిధ గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమాలు, అవినీతిని చూస్తూ ఊరుకోవాలా?


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకులు

గణపవరం: అవినీతి అక్రమాలకు పాల్పడితే చూస్తూ ఊరుకోవాలా? లేదంటే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలా? అనేది టీడీపీ నాయకులు, ఆయనకు మద్దతు ఇచ్చేవారు స్పష్టం చేయాలని వైఎస్సార్ సీపీ ఉంగుటూరు నియోజకవర్గ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాత్రి వారు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు క్యాంపు కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించి, చంద్రబాబు అరెస్టు విషయమై జరుగుతున్న రాద్ధాంతంపై స్పందించారు. స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు పాత్ర ఉన్నట్లు స్పష్టమైన ఆధారాలు ఉండటం వల్లనే ఆయనను సీఐడీ అధికారులు అరెస్టు చేశారని అన్నారు. చంద్రబాబు ఐదేళ్ల పాలనలోనే స్కిల్ డవలప్‌మెంట్ కుంభకోణం వెలుగుచూసిందని, అప్పట్లో ఆయన తన అధికార బలంతో కేసును తొక్కి పట్టి ఉంచారన్నారు. ఇప్పటి వరకూ విచారణ చేసిన సీఐడీకి స్పష్టమైన ఆధారాలు దొరికినందు వల్లనే చంద్రబాబును అరెస్టు చేశారని, దీనిలో వైఎస్సార్ సీపీకి, ప్రభుత్వానికి సంబంధం లేదన్నారు. చంద్రబాబుపై ఇంకా అనేక అవినీతి ఆరోపణలున్నాయని, వీటన్నింటిపై విచారణ చేస్తే తండ్రీ కొడుకులిద్దరూ జీవితాంతం జైలుకే పరిమితమవుతారని అన్నారు. సమావేశంలో ఎంపీపీలు అర్ధవరం రాము, ధనుకొండ ఆదిలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు కోడే కాశీ, దేవారపు సోమలక్ష్మి, జిల్లా వ్యవసాయ సలహా సంఘం ఛైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు సంకు సత్యకుమార్, దండు రాము, మండల సచివాలయ కన్వీనర్ నౌడు అచ్యుతరావు, పార్టీ నాయకులు కాన్వెంట్ శ్రీను, అలుమోలు గంగారాం, ధనుకొండ బుజ్జి, ధనుకొండ శ్రీను పాల్గొన్నారు.

బతికి.. సాధించాలి

సమస్య ఏదైనా క్షణికావేశంలో నిండు ప్రాణాలు బలితీసుకుంటున్న ఘటనలు సమాజంలో క్రమంగా పెరుగుతుండటం ఆందోళన రేకెత్తిస్తోంది. పరీక్షలో తప్పారనో, ఉద్యోగం రాలేదనో, ప్రేమ విఫలం అయ్యిందనో, కుటుంబ కలహాల వల్లనో అర్ధాంతరంగా జీవితాలను చిదిమేసుకుంటున్నారు. బలవన్మరణాలకు పాల్పడుతున్నవారిలో ఎక్కువగా యువత, అందులోనూ వ్యసనాలకు లోనైన వారు, మానసిక సమస్యలతో బాధపడుతున్నవారు ఉంటున్నారని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతి ఏడాది సెప్టెంబర్ 10వ తేదీన ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ఆత్మహత్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక సమస్యలతో బాధపడుతున్నవారికి కౌన్సెలింగ్, మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది.


ఏలూరు జీజీహెచ్‌లో ప్రత్యేక వార్డులో డీ.ఎడిక్షన్ సెంటర్‌లో బాధితులను పరామర్శిస్తున్న వైద్యులు


మానసిక రోగులకు పరీక్షలు చేస్తున్న సెక్రియాట్రిస్ట్ డాక్టర్ కె.హన్నా కోమలి

- ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు
- క్షణికావేశంతో నిర్ణయాలు సరికాదు
- ఆత్మహత్యల నివారణ దిశగా ప్రభుత్వం చర్యలు
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

ఏలూరు టౌన్/భీమడోలు : ఏదో ఒక కష్టం, నష్టం, ఆవేదన, ఆవేశం, ఉక్రోశం, ఆందోళన.. తీవ్ర భావోద్వేగాలకు లోనై నిరాశ నిస్పృహలకు గురై సమాజంలో ఒంటరిగా మిగిలిపోయామనో ఆత్మహత్యకు పురిగొల్పుతున్నాయి. సమస్యలను ఎదుర్కొలేని మానసిక బలహీనతే ఆ పని చేయిస్తుంది. మనోవేదనతో అర్థాంతరంగా తనువు చాలిద్దామనేలా వారిలో ఆలోచన రగిలేలా చేస్తోంది. పోటీతత్వంతో చదవలేక విద్యార్థులు.. సెల్‌ఫోన్ చూడనివ్వలేదని తల్లిదండ్రులపై అలిగి.. ప్రేమలో విఫలమై యువతీ, యువకులు.. అత్తింట వేధింపులు తట్టుకోలేక.. ఆర్థిక పరిస్థితుల కారణంగా.. మోసం చేశారనో.. వ్యసనాల బారిన పడి ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారు. జీవితంలో ఎటువంటి అనుభూతులను ఆస్వాదించకుండానే నిండు జీవితాన్ని అధికశాతం యువత ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. జీవితంలో ఓడిపోయామని, మనం ఏమి సాధించలేమనే నిరాశ నిస్పృహలతో యవ్వనంలోనే నిండు జీవితాన్ని ముగిస్తూ కుటుంబ సభ్యులకు కన్నీరుమిగిలిస్తున్నారు. ఆత్మహత్యల నివారణకు మానసిక వైద్య నిపుణులు, ప్రభుత్వాలు ఎన్నో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఆత్మహత్యల నివారణకు జుడీషియల్ విభాగం సైతం న్యాయవిజ్ఞాన సదస్సులు నిర్వహిస్తూ ప్రజల్ని చైతన్యపరుస్తోంది.

ఆత్మహత్యలు చేసుకునే వారి ఆలోచనలు ఇలా

పదే పదే ఆత్మహత్యలపై మాట్లాడుకోవడం, తనకు తానే హాని కలిగించుకునేందుకు ప్రయత్నించడం, తీవ్ర ఒత్తిడితో చికాకు పడడం, ఒంటరి జీవితాన్ని ఇష్టపడడం, నిరాశా నిస్పృహాలు, ప్రతి విషయాన్ని ప్రతికూలంగా ఆలోచించడం, నిద్రలేమి అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం, ఇలాంటి మార్పులు ఒక వ్యక్తితో కనిపిస్తే ఆత్మహత్య గురించి ఆలోచనలు చేస్తున్నట్లు భావించాలని మానసిక వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా 15 నుంచి 80 సంవత్సరాల వయస్సు వరకు ప్రతి ఒక్కరూ ఏదోక సందర్భంలో ఆత్మహత్య చేసుకోవాలన్న బలహీన క్షణాలను ఎదుర్కొనే ఉంటారు. మానసిక ఒత్తిడికి గురవతున్న మహిళల్లో కూడా ఇటువంటి ఆలోచనలు ఎక్కువే. మహిళలు కన్నా పురుషులే ఎక్కువగా ఆత్మహత్యలు పాల్పడుతుండగా, వారిలో గ్రామీణ ప్రాంతాల్లో వారే ఎక్కువ.

స్నేహపూర్వక మాటలతోనే తొలి చికిత్స

ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచించే వారిని గుర్తించిన వెంటనే వారిలో సాధ్యమైనంత త్వరగా స్నేహపూర్వకంగా మాట్లాడాలి. వారికి కుటుంబ సభ్యులు, స్నేహితులు ధైర్యం చెప్పాలి. మంచి మాటల ద్వారా అండగా ఉన్నామనే భరోసా ఇచ్చే ప్రయత్నం చేయాలి. ఓపికగా వారి సమస్యలను అడిగి తెలుసుకోవాలి. వారి చెప్పే సమస్యలు అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను చూపాలి.

నెలకు 20 నుంచి 30 కేసులు

ఏలూరు జీజీహెచ్‌కు నిత్యం ఆత్మహత్యాయత్నం, ఆత్మహత్య కేసులు నెలలో సుమారుగా 20 నుంచి 30 వరకూ వస్తూ ఉంటాయి. వీటిలో 50శాతానికి పైగా యువత ఉంటున్నారు. ఆత్మహత్యాయత్నం కేసులు ఏడాదికి 2 వేలకు పైగా ఉంటుండగా, వీటిలో సుమారుగా 100 నుంచి 180 మంది వరకు ఆత్మహత్య కేసులు ఉంటున్నాయి. ఏలూరు జీజీహెచ్‌లోని మానసిక వైద్య విభాగం ప్రత్యేక శ్రద్ధతో ఆత్మహత్యాయత్నం కేసుల్లో బాధితులకు కౌన్సెలింగ్ ఇస్తూ భరోసా కల్పిస్తోంది. మహిళలు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి, మత్తుపదార్థాలు, గంజాయి, మద్యం వంటివాటికి బానిసలైన వారికి కౌన్సెలింగ్, చికిత్స అందిస్తూ వారిలో మార్పుకు కృషి చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో మానసిక వైద్యం కోసం చేరిన రోగుల వివరాలు

సంవత్సరం	రోగులు	డిప్రెషన్ కేసులు	మానసిక ఆందోళన	మద్యం, డ్రగ్స్ కేసులు
2021-22	4828	880	783	3165
2022-23	3749	759	1231	1759

టోల్‌ఫ్రీ 14416 కు కాల్ చేయండి



జీవితం చాలా విలువైంది. మానసిక సమస్యలకు ఏలూరులోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నాం. టెలీ మానస పేరుతో టోల్ ఫ్రీ నంబర్ 14416కు కాల్ చేస్తే వారికి ఆన్‌లైన్‌లో నిష్ణాతులైన మానసిక వైద్యులతో కౌన్సెలింగ్ ఇస్తారు. పరిస్థితి తీవ్రంగా ఉంటే స్థానిక ఆశా వర్కర్, ఏఎన్‌ఎంలకు సమాచారం ఇచ్చి వెంటనే ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడ చికిత్స అందిస్తారు.

– కె.శ్రీనివాసరావు, సైకాలజిస్ట్, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు

ప్రతి సోమ, శుక్రవారం ఉచిత పరీక్షలు



ఆత్మహత్య ఆలోచన సరికాదు. జీవితాన్ని సవాల్‌గా తీసుకుని జీవిస్తున్న వారు ఎందరో. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేనివారికి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షించి ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ప్రతి సోమవారం, శుక్రవారం ఆసుపత్రిలోనే అందుబాటులో ఉంటాం. మిగిలిన రోజుల్లో పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు వెళ్లి పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తున్నాం.

– డాక్టర్ కె.హన్నా కోమలి, మానసిక వైద్యురాలు, ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి, ఏలూరు

భరోసా కల్పించాలి



ఆన్‌లైన్ గేమ్స్ యువత, విద్యార్థులపై పెను ప్రభావాన్ని చూపిస్తున్నాయి. సమస్యలు, ఇబ్బందులు, మానసిక ఒత్తిడి, కష్టాలు ఎదురైతే తమ బాధను కుటుంబ సభ్యులు, స్నేహితులు, హితులకు చెప్పుకోవటం ద్వారా ఆత్మహత్య చేసుకోవాలనే భావనను దూరం చేస్తుంది. దీనివల్ల ఆత్మహత్యలను సాధ్యమైనంత మేర నిలువరించే అవకాశం ఉంది.

– డాక్టర్ సీహెచ్ వంశీకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్, హెచ్‌వోడ్, జీజీహెచ్ ఏలూరు

ఆందోళనకు ఉపక్రమించిన టీడీపీ నాయకుల అరెస్టు

ఉంగుటూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా ఆందోళనకు దిగబోయిన తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు 14 మందిని అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు.

నిడమర్రులో ప్రశాంతం

నిడమర్రు: స్కిల్‌డవలప్‌మెంట్ స్కాంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడి అరెస్ట్ నేపథ్యంలో శనివారం నిడమర్రు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు జరగలేదు. నిడమర్రు సీఐ సుభాష్ ఆధ్వర్యంలో ప్రధాన కూడళ్ల వద్ద పోలీసులు పహారా కాసారు. ఇటీవల లోకేష్ పాదయాత్ర నేపథ్యంలో మందలపర్రు వద్ద టీటీడీ బోర్డు సభ్యుడు గాదిరాజు పెదబాబు ఫ్లెక్సీలు చించివేసి అల్లర్లకు కారణమైన యువగళం వలంటీర్లు, నాయకుల అరెస్టుల నేపథ్యంలో టీడీపీ క్యాడర్ ఏవిధమైన ఖండన చర్యలకు పాల్పడలేదని తెలుస్తోంది. మరో వైపు ఈ విషయంపై టీడీపీ శ్రేణులకు పోలీసులు ముందస్తుగానే హెచ్చరికలు జారీ చేసారు. నిడమర్రు, బువ్వనపల్లి సెంటర్లలో ఎస్సై ఆర్. శ్రీను, నిడమర్రు పోలీసులు వాహనాల తనఖీలు చేపట్టారు. శనివారం నిడమర్రు మండలంలో ప్రశాంత వాతావరణం కనిపించింది.

ట్రాఫిక్‌కు అంతరాయంపై కేసు నమోదు

దెందులూరు: జాతీయ రహదారిపై దెందులూరు మండలం కొవ్వలి ఫ్లైఓవర్ వద్ద శనివారం 15 నిమిషాలు వాహనాలను నిలుపుదల చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేశామని దెందులూరు ఎస్సై ఐ.వీర్రాజు తెలిపారు. వీడియో ఆధారంగా వాహనాలను నిలుపుదలచేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేసినట్టు వివరించారు.

నాయకుల ముందస్తు అరెస్టు

పెదపాడు: చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో పెదపాడు మండలంలోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు పెదపాడు ఎస్సై కృష్ణ చల్లా తెలిపారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులను అరెస్టు చేసామని తెలిపారు. పెదపాడు సెంటర్‌లో గుమిగూడిన 30మందిపై 151 సీఆర్‌పీసీ ప్రకారం ముందస్తు అరెస్టు చేసినట్లు తెలిపారు.

12,13 తేదీల్లో మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక

పెదవేగి : అండర్ 14, 17 బాలబాలికలకు మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ బుద్ధవాస్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని యాజమాన్య ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈనెల 12న పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకులంలో మండల స్థాయిలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. 13న కొప్పాక ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహిస్తారని ఎంఈఓ తెలిపారు. వివరాలకు ఫోన్ 6300103545ను సంప్రదించాలని కోరారు.

కోళ్ల వ్యర్థాల వాహనం సీజ్

పెదపాడు: గుడిపాడు వద్ద నిషేధిత కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు పెదపాడు పోలీసులు శనివారం తెలిపారు. స్వాధీనం చేసుకున్న 3 టన్నుల కోళ్ల వ్యర్థాలను ఊరికి దూరంగా పూడ్చివేసినట్లు తెలిపారు. వాహన డ్రైవర్, యజమానితోపాటు చెరువు యజమానిపైన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.